ఈ ఛాప్టర్‌లో ఒకసారి నేను పిల్లల్తో కలిసి మీరు జీవితాన్ని ఆస్వాదించడం గురించి చెప్పడం జరిగింది.

పిల్లలని ఒక స్విమ్మింగ్‌ఫూల్‌కో, పార్కుకో, జూలాజికల్ పార్క్‌కో తీసుకువెళ్లడం ద్వారా వారిలో వున్న చురుకుదనాన్ని, మీరు ఎక్కువజేసే వీలు కలుగుతుంది. పిల్లల్లో ధైర్యం భయం యివన్నీ రకరకాల పాళ్ళల్లో వుంటాయి. వీళ్ళతో కలిసి బయట ప్రపంచంలో తిరగడం ద్వారా వీటిని మీరు గుర్తించగలుగుతారు.

ప్రస్తుత కాస్మోపాలిటన్ నగరాల్లో వున్న పిల్లల్లో ఎనభైశాతం మంది పిల్లలు ఇంతవరకూ కనీసం నదిమీద పడవలో షికారు చెయ్యలేదంటే మీరు నమ్మగలరా?

దీనికి బాధ్యత కేవలం తల్లిదండ్రులదే. తమ రొటీన్ జీవితంలో కనీసం నాలుగురోజులు వెచ్చించి, తమ కుర్రవాడికి నది యెలా వుంటుందో, పడవలో ప్రయాణం ఎలా వుంటుందో చెప్పలేకపోతే; పిల్లల్ని కని ఆ తల్లిదండ్రులు పెంచి పెద్దచేసే కర్తవ్యాన్ని మాత్రమే తీసుకున్నారు తప్ప, వాళ్ళకి ఒక గొప్ప అనుభూతి నివ్వాలనే బాధ్యతని తీసుకోలేదన్నమాట.

ధైర్యం అనేది ఒక పెద్ద పదార్థంకాదు. అది మనం చేసే పనులవల్లే మనకొస్తూ వుంటుంది. ఉదాహరణకి మీ ఆరేళ్ళ పిల్లవాణ్ని స్విమ్మింగ్‌ఫూల్లో అయిదారు నెలలపాటు ఈత నేర్పిస్తే, వాడికి చిన్నతనంలోనే నీళ్ళపట్ల భయం పోతుంది. నీళ్ళపట్లే కాదు, జీవితంపట్ల కూడా చాలావరకూ భయం పోతుంది. స్విమ్మింగ్ అనేది మానసిక శాస్త్రవేత్తల థియరీ ప్రకారం జీవితాన్నే ఎదుర్కొనే పెద్ద చర్యకు చిన్న ప్రారంభం.

అధ్యాయం - 3

రకరకాల తల్లిదండ్రులు

ఒక పదమూడేళ్ళ అమ్మాయి స్కూల్‌నుంచి ఓ రెండు గంటలు ఆలస్యంగా ఇంటికి వచ్చిందనుకోండి. ఆ ఆలస్యం పట్ల రకరకాల తల్లిదండ్రుల ప్రతిస్పందన వేరు వేరు విధాలుగా వుండవచ్చు.

తండ్రి ముందు రూమ్‌లో భీకరంగా పచార్లు చేస్తూ, కూతురు యింట్లోకి అడుగు పెట్టగానే రెక్కపట్టుకొని ముందుకు లాగి "ఎందుకాలస్యం అయిందే" అని అడుగుతారు. ఆ అమ్మాయి జవాబు చెప్పేలోగానే చెంపమీద టపటపామని "వళ్ళు చీరేస్తాను. ఎప్పుడయినా ఇలా ఆలస్యంగా వస్తే రక్తం కళ్ళజూస్తాను. పోవే...... పో....... అడుక్కుతిను -" అంటూ రౌద్రంగా అరిచాడు. మధ్యలో తల్లి అడ్డుపడకపోతే "దాన్నీ, నిన్నూ కిరసనాయిలు పోసి తగలబెడతాను. నాకడ్డురాకు. పో..... వంటింట్లో తగలడు" అని భార్యని గదమాయించవచ్చు.

మరో కుటుంబంలో...... ఆ పాప ఇంటికి ఆలస్యంగా వచ్చినప్పుడు తల్లి మెట్లమీద కూర్చుని గుడ్లనీరు కక్కుకుంటూ పాప రాగానే వచ్చావా ఇంత ఆలస్యం అయిందే.

వెయ్యిదేవుళ్ళకి మొక్కుకున్నాను. నీకే ఆక్సిడెంట్ అవుతుందేమోనని..... ఏమండీ పాపొచ్చింది" అంటూ ఇంట్లోకి పరిగెడితే ఆ భర్త సోఫాలో కూర్చుని పేపరు చదువుకుంటూ "వచ్చిందా..... అనవసరంగా రెండుగంటలు ఇల్లంతా నానాయాగీ చేశావు" అని పేపరు పక్కన పడేసి అటు తిరిగి పడుకోవచ్చు.

మరో కుటుంబంలో...... పాప స్కూల్‌నుంచి ఆలస్యంగా వస్తుంది. తల్లి వంటింట్లో కూర్చుని పనిచేసుకుంటూ వుంటుంది. తండ్రి రూంలో ఫైల్స్ చదువుకుంటూ వుంటారు. ఎవరి పనుల్లో వాళ్ళుంటారు. ఈ పాప తన గదిలోకెళ్ళి పుస్తకాలు పడేసి, పెరట్లోకి వెళ్ళి కాళ్లూ చేతులూ కడుక్కొని భోంచేసి తన రూంలోకి వెళ్ళిపోతుంది.

ఆ పాప వచ్చి ఎంతసేపైనా అక్కడ పట్టించుకునే వాళ్ళెవరూ వుండరు. రోజూ కరెక్టు టైంకి వచ్చే పాప ఒకరోజు ఆలస్యంగా వస్తే 'ఎందుకాలస్యం అయింది?' అని అడిగేవాళ్ళు వుండకపోవడం ఎంతో బాధాకరమయిన విషయం.

ఎవరూ అజమాయిషీ చెయ్యని స్వేచ్ఛా ప్రపంచాన్ని ఒకవేపు ఆనందంగా అనుభవిస్తున్నా, మనసులో ఏదో ఒక మూల 'నన్ను పట్టించుకునే వాళ్ళెవరూ లేరు' అన్న బాధకూడా ఆ పాపకి వుంటుంది.

ఇంకో ఇంట్లో తండ్రి ఎప్పుడూ గంభీరంగా వుంటాడు. ఆలస్యంగా వచ్చిన పాపను తల్లి ప్రశ్నలు వేస్తుంది. ఈ తండ్రి జడ్జిలా అన్నీ వింటాడు తప్ప ఏ ప్రశ్నా అడగడు. తను ఏ విషయంలో కల్పించుకున్నా తనపట్ల వారికి గౌరవం పోతుందని, ఎప్పుడూ మౌనంగా, గంభీరంగా వుంటుంటాడు. తల్లి అడిగిన ప్రశ్నలకి సంతృప్తికరమైన సమాధానాలు రాకపోతే గంభీరంగా తన రూంలోకి వెళ్ళిపోతాడు. తల్లి ఆ పాపని బాగా తిడుతుంది.

ఇంకొక యింట్లో చాలా చిత్రంగా వుంటుంది. తల్లిదండ్రుల ప్రవర్తన, అమ్మాయి ఆలస్యంగా ఇంటికి వస్తుంది. తల్లి 'ఎందుకే ఇంత ఆలస్యం అయింది' అని ఆ అమ్మాయిని అడగ్గానే ఆ అమ్మాయి తండ్రి బయటకొచ్చి 'ఎక్కడికి పోతాయ్ అన్నీ తల్లి బుద్దులు' అంటూ తన భార్యని వెక్కిరిస్తాడు.

ఆమె వెంటనే, నావేం కాదు, ఇంట్లో శ్రీరామచంద్రుడు, బయట శ్రీకృష్ణుడు అవతారమెత్తే మీవే. కాకపోతే ఆడపిల్లకి ఇటువంటి బుద్ధులొచ్చాయే అని నా బాధ అంటుంది. 'ఆ బోడి మీవాళ్ళిచ్చిన అయిదువేలు కట్నానికి శ్రీకృష్ణుడు రాక అపర శ్రీరామ చంద్రుడొస్తాడా' అంటూ రెచ్చిపోతాడు.

ఆమె వెంటనే 'మీకు ఆ అయిదువేలు ఇవ్వడమే దండగ' అంటూ మాట తిప్పికొడుతుంది. రెచ్చిపోయిన అతడు ఆమెని నాలుగు బాదుతాడు. ఎక్కడ ప్రారంభమైన సంభాషణ, ఎటు తిరిగి, ఎక్కడ ముగిసిందో చూసిన ఆ పాప కంగారు పడిపోతుంది.

ఒక సంఘటనకి రకరకాల ఇళ్ళల్లో రకరకాల పరిణామాలు సంభవించడం జరిగింది.

ఇలా ఒక సంఘటనకి రకరకాలుగా ప్రతిస్పందించే తల్లిదండ్రులని నాలుగు రకాలుగా విడగొట్టవచ్చు.

1. మిలటరీ నియంతలు
2. సంబరాల రాంబాబులు
3. మర్యాద రామన్నలు
4. భూతద్దం తల్లిదండ్రులు.

మిలటరీ నియంతలు :

"నేను నిన్ను గెంతమన్నప్పుడు 'ఎందుకు?' అని అడగకు. 'ఎంత ఎత్తు?' అని మాత్రమే అడగాలి" - ఇదీ వీరి మనస్తత్వం!

ఈ రకం తల్లిదండ్రులు ఎప్పుడు, ఏ మూడ్‌లో వుంటారో అర్థం చేసుకోవడం కష్టం. పిల్లల మీద తాము పెట్టుబడిగా పెట్టే డబ్బు, సమయం వృధాకాకుండా, చాలా త్వరగా ప్రతిఫలం రావాలనికోరుకుంటారు. తమ పిల్లవాడు ఒక సబ్జెక్టులో మరీ 'వీక్' అని తెలిసినప్పుడు వెంటనే ఇంటిదగ్గర ఒక ట్యూషన్ మాస్టార్ని పెట్టిస్తారు.

పెట్టించిన మరుసటి నెలలో ఏదైనా 'మంత్లీ టెస్ట్‌లో' తమ పిల్లవాడికి అవే సబ్జక్టులో పదిలోపు మార్కులు వచ్చాయనుకోండి. ఆ విషయం తెలియగానే వెనకా ముందు ఆలోచించకుండా "ఎవడా ట్యూషన్ మాస్టారు? ఏం చెబుతున్నాడు వాడు? పిల్లవాడికి పది మార్కులు కూడ రాలేదు. వాడ్ని తీసేస్తాను" అని గంతులేస్తాడు.

వీళ్ళకి ఇమ్మీడియట్‌గా, 'ఓవర్‌నైట్'లో తమ పిల్లవాడు గొప్పవాడు కావాలని వుంటుంది. అంతేకాని 'తమ పిల్లవాడు ఆ సబ్జక్టులో ఎంత వీక్? అతను ఇంప్రూవ్ కావాలంటే ఎంత టైం పడుతుంది' ఇలాంటివేమీ వీళ్ళు ఆలోచించరు.

పిల్లలకు ఒక పని చెబితే వాళ్ళు దానిని ఎదురు ప్రశ్న వేయకుండా క్షణాల్లో చేసేయాలని కోరుకుంటారు. తమ పిల్లవాడికి "పెన్సిల్ తీసుకురా" అని చెబితే వాళ్ళు ఎందుకు? ఏమిటి? అని అడగకూడదు. వెళ్ళి పెన్సిల్ తీసుకువస్తే అది వేళ్ళ మధ్య పెట్టి రూళ్ళకర్రతో బాదుతారు. ఇటువంటి తల్లిదండ్రులు పిల్లల దృష్టిలో నియంతలుగా మిగిలిపోతారు. అందుకు కారణం వీళ్ళు అనుసరించే పద్ధతులే.

పిల్లలను కూడా ఎంత మాటంటే అంతమాట వెనకాముందు ఆలోచించకుండా అనేస్తారు. అలా మాట్లాడినందువల్ల ఆ పిల్లలు ఎంత 'హర్ట్' అయ్యారో అనేది వీళ్ళకి అనవసరం. తమ జీవితంలో ఒక్కరోజు కూడా పిల్లల్ని ప్రేమగా ప్రక్కన కూర్చోబెట్టుకొని వాళ్ళ సమస్యల గురించి అడగరు.

అలా కూర్చోపెట్టుకొని మాట్లాడితే తమ మీద వాళ్ళకి గౌరవం తగ్గిపోతుందని భయం. అందుకే పిల్లలు పెరిగేకొద్దీ మానసికంగా దూరమవుతారు. బయటినుంచి ఏమాత్రం

ప్రేమానురాగాలు ఎవరివైపు నుంచి వచ్చినా అటువైపు ఆకర్షింపబడతారు.

ఈ రకం తల్లిదండ్రులకి పిల్లల చిన్న వయస్సులో భయపడ్డా, పెరిగేకొద్దీ తిరగబడతారు. ఈ పిల్లలు ఎదిగిన తరువాత ఆ ఇంట్లో నిత్యం ఘర్షణలు తప్పవు.

అలాగని ఈ రకం తల్లిదండ్రులకి తమ పిల్లలమీద ప్రేమలేదని, వీళ్ళు చెడ్డవాళ్ళని చెప్పలేము. వీళ్ళకున్న మంచి గుణం క్షణాల్లో నిర్ణయాలు తీసుకోవడం, అంతే వేగంగా వాటిని అమలుపర్చడం పక్కింటి పాపాయికి చాలామంచి ఫ్రాకులున్నాయని, ఆ పిల్లముందు తమ పాపాయి తీసికట్టుగా వుందని అనిపిస్తే, క్షణాల్లో బజారుకెళ్ళి మంచి బట్టలు తీసుకువస్తాడు. తమ పిల్లలు గుంపులో గోవిందా అన్నట్లుగా వుండకుండా ఏ కరాటేనో, డాన్సో నేర్చుకుంటామంటే - క్షణాల్లో తీసుకెళ్ళి అక్కడ చేర్పిస్తారు.

ఈ రకం తల్లిదండ్రులు, తమ పిల్లలు తమని ప్రేమించాలంటే వాళ్ళకి మానసికంగా దగ్గర కావాలంటే, కొన్ని అలవాట్లను, వ్యక్తిగత లోపాలను సరిదిద్దుకోవాలి. ఈ క్రింది విషయాలను అనుసరించాలి.

1. తమ పిల్లల అవసరఆలు, సమస్యల పట్ల త్వరగా ప్రతిస్పందించి, వారికి కావలసినవి సమకూర్చే ముందు దానియొక్క పరిణామాలను కూడా ముందే ఆలోచించి వుంచుకోవాలి. నిర్ణయాలను త్వరత్వరగా తీసుకోకూడదు.
2. కోపం వచ్చినపుడు, ఆవేశం వచ్చినపుడు ఏ మాటంటే ఆ మాట అనేయకుండా ఎదుటివారు ఆ మాటలకు ఎంత బాధపడతారో ఆలోచించాలి. తమని తాము నిగ్రహించుకోవలి.
3. తమకి, తమ పిల్లలకి మధ్య అవగాహన పెంచుకోవాలి. రోజూ ఓ గంటపాటు వాళ్ళతో మాట్లాడే అలవాటు పెంచుకోవాలి.
4. తమ కుటుంబం పట్ల తమకున్నది ప్రేమానురాగాలేకాని, వాటిని బరువు, బాధ్యతలుగా పీల్‌కావటం లేదని తెలియజేయాలి. తమ పెద్దరికాన్ని నిర్దాక్షిణ్యంగా అమలుచేయకుండా, ఆప్యాయతతో వారిని ఆకట్టుకోవాలి.
5. ఏ విషయంలోనైనా తమ మాటే నెగ్గాలని మొండిపట్టు పట్టకుండా కుటుంబ సభ్యులు చెప్పే విషయాలను కూడ పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ టైపు తల్లిదండ్రులు ప్రవర్తించే విధానానికి ఒక మంచి ఉదాహరణ చెబుతాను. రెండు మూడు రోజుల్లో అతను ఇల్లు మారుతున్నామని చెప్పాడు. భార్యాపిల్లలకి ఇల్లు ఎందుకు మారుతున్నారో అర్థంకాదు. లారీ తీసుకువచ్చి సామాను ఎక్కించి వేరేఇంటికి తీసుకువెళ్ళినప్పుడు అర్థమైంది - పాత ఇల్లు ఎవరికో అమ్మేశాడని, తమ తండ్రి డబ్బుకు అంత ఇబ్బంది పడుతున్నాడని ఆ పిల్లలకు చివరివరకు తెలియకపోవడం వాళ్ళ అదృష్టం కాదు దురదృష్టం. ఈ టైపు తల్లిదండ్రులు ముఖ్యంగా తమ సుపీరియారిటీని వదులుకోవాలి. అది

వదులుకుంటే తప్ప పిల్లలతో సాన్నిహిత్యం పెరగదు.

6. నిర్ణయాలు తీసుకునేశక్తి తమకు మాత్రమే వుందని, ఇంట్లో మరెవరికీ ఆ శక్తి లేదని అనుకోవడము పొరపాటు. అన్ని విషయాలలోను తమ నిర్ణయమే సరైంది అనుకోవడం భ్రమ. ఆఫీసులో ఎంత పెద్ద పొజిషన్‌లో వున్నా, ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా, ఇంట్లో మాత్రం తనకన్నా మంచి నిర్ణయాలు తీసుకునేవారు కనీసం ఇద్దరుంటారు. భార్య, కొడుకు, కూతురు.

ఉదాహరణకి ఇంటికి సోఫాసెట్టు తీసుకురావడం మంచి ఆలోచన. కానీ మీకు నచ్చింది తీసుకువస్తే తక్కిన వారికి ఆ చర్య అంత సంతోషకరంగా వుండదు. ఇంట్లో నలుగురూ కూర్చుని గోడకున్న కలర్‌కి ఏ కలర్ సోఫాసెట్ మ్యాచ్ అవుతుందో ఆలోచించి తీసుకువస్తే ఆ చర్యలో తమకీ భాగముందని ఇంట్లో అందరూ సంతృప్తిపడతారు. వాళ్ళు చెప్పినది మీకు నచ్చకపోతే, మీ నిర్ణయమే సరియైనదనిపిస్తే ఆ విధంగా చెయ్యొచ్చు కానీ చెప్పి ఆచరించటం వేరు, అసలు చెప్పకపోవడం వేరు.

7. మీకు నచ్చిన కూరలే మీ భార్య తరచూ వండుతుంటే, అది మీ నియంతృత్వానికి ఒక నిదర్శనం. ఈ పుస్తకం చదువుతున్న టైంకి మీ భార్యకి ఏయే కూరలు ఇష్టమో తెలియకపోతే అది కూడా నియంతృత్వానికి ఒక ఉదాహరణ.

సంబరాల రాంబాబులు :

మీరెప్పుడైనా జంతు ప్రదర్శనశాలకి వెళితే అక్కడ 'ఓటర్' అనే జంతువు వుంటుంది. అది ఎప్పుడూ సరిగా ఒకచోట కూర్చోదు. ఆఖరికి తిండి తినడం, గుట్టలమీద నుంచి గెంతడం లాంటివి కూడా ఒక జోక్‌గా తీసుకుని, నిత్యం సరదాగా అరుస్తూ వుంటుంది. జోవియల్ తల్లిదండ్రులు శాపవశాత్తు జంతువులుగా మారటం సంభవిస్తే ఈ ఓటర్లుగా మారతారు.

సామూహిక జీవితమంటే వాళ్ళకి ఇష్టం. ఎప్పుడూ వాళ్ళింట్లో పార్టీలు జరుగుతూ వుంటాయి. నలుగురైదుగురితో కలిసి వుండకపోతే వాళ్ళకి తోచదు. వీరు తమ పిల్లలతో చాలా క్లోజ్‌గా వుంటారు. సరదాలెక్కువ.

'రోజంతా తిండి లేకపోయినా ఫర్లేదు కానీ గంటసేపు సరదాగా గడిపితే చాలు' అనుకునే రకం వీళ్ళు. పిల్లలతో స్కూల్ విషయంలో, పిల్లల పక్కన ఆ బెంచీలో ఎంతమంది కూర్చుంటారు? టీచర్ ఏ రకం డ్రస్సులు వేసుకొస్తాడు? స్కూల్ లంచ్ అవర్ ఎన్ని గంటలకి? మంచి నీళ్ళు ఎక్కడ తాగుతారు? - ఇలాంటి వాటన్నింటినీ కూడ పిల్లల దగ్గిర నుంచి అడిగి తెలుసుకుంటారు. మాట్లాడుకోవటానికి వీళ్ళకి ఎప్పుడూ ఏదో ఒక టాపిక్ కావాలి. అది ఎంత నిరర్థకమైనదైనా సరే.

అందరితో మంచిగా వుండటం వీరి అలవాటు. అయితే ఈ అలవాటే వీళ్ళకి అన్ని సమస్యలనూ తెచ్చిపెడుతుంది. వీళ్ళు దేనినీ "కాదు" అనలేరు. ఆఫీసులో అయినా,

స్నేహితులయినా, ఎవరు ఏ పని చెప్పినా ఆ బాధ్యత నెత్తిన వేసుకుంటూ వుంటారు. ఉన్న కాసేపు పిల్లలతో తీరికగా మాట్లాడేందుకు సమయం ఎక్కువ దొరకదు.

వీళ్ళల్లో వున్న ఇంకొక బలహీనత ఏమిటంటే అందరిచేత మంచి అనిపించుకోవాలని చాలా కోరికగా వుంటుంది. అవతలివాళ్ళు తమ నిష్టపడాలని కోరుకోవడంవల్ల వాళ్ళు ఎంత పని చెప్పినా కాదనకుండా, రాత్రంతా మెలకుని వాళ్ళప్పగించిన పని పూర్తిచేస్తారు. అందువల్ల వీళ్లకి వీళ్ళపిల్లలతో తీరికగా గడిపే 'టైం' వుండదు.

ఉదాహరణకి భార్య 'సాయంత్రం తొందరగా రండి. షాపింగ్ చేయాలి' అంటే అదే సాయంత్రం ఒక కొలీగ్ రెండు నెలల తరువాత జరగబోయే తన పెళ్ళికి బట్టలు సెలెక్ట్‌చేద్దాం రమ్మంటే భార్య కిచ్చిన మాట మర్చిపోయి, ఎప్పుడో జరగవలసిన కొలీగ్ పెళ్ళికి బట్టలు చూడటానికి షాప్‌కెళతాడు. భార్య దగ్గిర్కన్నా ఆ కొలీగ్ దగ్గర 'మంచి' అనిపించుకోవాలని వుండటమే దీనికి కారణం.